# పీఠిక పాపారావు

తెలుగు భాషను ఔపోసన పట్టాలనే దృఢ సంకల్పంతో పి.హెచ్.డి. చేవాడు పాపారావు. పీ.పా. అంటే స్టేట్లో ఆయన్ను ఎరుగనివారులేరు. ముఖ్యంగ యూనివర్సిటీ లెవెల్లో... అందునా తెలుగు కవితా, కథా, నవలా రచయిత(త్రు)లకు.

ట్యూటర్‌గా చేరి లెక్చెరర్రై... ప్రొఫెసర్రై... కడకు వి.సి. శిఖరాన్ని అధిరోహించిన వాడు పాపారావు.

పాపారావనగా... పుస్తకాల పురుగు ! యూనివర్సిటీ లైబ్రెరీలో వున్న తెలుగు సాహిత్యం మొత్తాన్ని బట్టీయంవేసి ఔపోసనపట్టిన ఘటికుడాయన! విషయాన్ని ఎప్పుడు ఎక్కడ ఎలా ఉదహరించుఆలనుకున్నా... విషయాలను సానుకూలంగ చదివి జీర్ణించుకున్నవాడు కావటంతో గుర్తుచేసుకుని గడగడా వప్పచెప్పగల మేధావి.

యువతకు ఉపకరించే ఎన్నో పుస్తకాలు రాసినవాడు! తెలుగుభాష గురించి పాపారావుతో సంభాషించాలన్నా హడలి ఛస్తారు. తెలుగుభాషాగిరులను పిండికొట్టగల సామర్థ్యం ఆయనసొత్తు!

పాపారావు తిరగని దేశం లేదు. ఏదేవమేగినా... ఎందుకాలిడినా... పొగడరా నీ తల్లి (అనాగా తెలుగుతల్లి) భూమి భారతిని అనే సిద్ధాంతాన్ని అక్షరాలా అక్షరక్రమంలో తెలుగు భాషలోనే ఉపన్యసిస్తాడేగాని ఒక్క పరభాషా పదమైనా ఆయన ఉపన్యాసంలోగానీ... రచనలోగాని దొర్లదు. స్వచ్ఛమైన తెలుగు భాషా ఉన్నతికి నడుము బిగించిన ఉన్నతుడు పాపారావు.

తెలుగు భాషలో చెడుగుడులు ఆడగల ధీశాలి! ఆయన సంభాషణలో అలవోకగ కవితా మాధుర్యం కానవచ్చును. పద్యగద్య రచనల్లో అగ్రగణ్యుడు.

బిరుదులకు పురస్కారాలకు కొదువలేదాయనకు ! ఏ కార్యక్రమంలో చూతమన్ననూ ఆయనే దర్శనమివ్వటం విశేషం! రోజూ ఏదో ఒక సభలో ప్రసంగిస్తూండటం ఆయనకు అలవాటు.

స్వతహాగ... ప్రచారం గిట్టని మనిషాయన! అయినా అభిమానుల ప్రోద్భలం మూలాన వేదికలెక్కటం ఉపన్యసించటం తప్పటంలేదు.

పాపారావుది అచ్చొచ్చిన హస్తవాసి ! బెల్లం చుట్టూ ఈగలు మూగినట్టు... ఆయన అభిమానులు అరాధకులు ఎప్పుడూ ఆయనను వెన్నంటి వుంటారు.

పాపారావు పెళ్లిపెటాకులు... పిల్లాజల్లాలేని వంటరివ్యక్తి! ఇంటా బైట పుస్తకాలే ఆయన నేస్తాలు!

మంచి శరీరఛాయ... గిరిజాల జుత్తు... పంచకట్టు.. పెదాలపై నిత్యం నృత్యం చేసే చిరుమందహాసం ఆయనకు పెట్టని ఆభరణాలు ! ఆరడుగుల ఎత్తు... మాంఛి అందగాడు.

అన్ని వయసుల ఆడవాళ్లు ఆయన్ను కన్నార్పకుండా వీక్షిస్తూ మురుస్తుంటారు. పెళ్లి చేసుకంటామంటూ ఎందో సుందరీమణులు ముంఉదకొచ్చి 'క్యూ' కట్టినా అందరినీ సున్నితంగ తిరస్కరించిన వ్యక్తిత్వం ఆయనది !

శృంగారం గురించి పాపారావు విద్యార్థినీ విద్యార్థులకు వర్ణిస్తూ పాఠాలు చెప్తుంటే ఆడమగ క్లాసులోని వారంతా తమను తాము మరచిపోయి మైకంలో ఓలలాడతారు.

ఇంతటి ఘనచరితుడు వయస్సు మీరి వి.సి.గా యూనివర్సిటీలో వున్న రోజుల్లో... గోడలమీదికెక్కక తప్పలేదు పాపం!

పాపాయమ్మ తెలుగు హెడ్ పాపారావు చూచిన క్షణాల్లో మైమరచి మనసు పారేసుకుంది. అటుపై ఆయన వెంటపడింది ! బుట్టలో వేసుకోవాలని అనేకానేక ప్లాన్లు వేసింది. ప్రయత్నాలు చేసింది. ఆయనతో రాసుకు పూసుకు తిరగటానికీ సాహసించింది.

కానీ... పాపాయమ్మ పప్పులే వుడకలేదు ! ఛీ... పోబాలపామ్మికన్' అంటూ పోజుపెట్టి, కళ్లతో కసిరాడు.

పాపాయమ్మకేమో వళ్లు మండింది. భర్త పోయిన విధవరాలైన ఆమెకు పిల్లల్లేకపోవటంతో పాపారావు పిచ్చిపిచ్చిగా నచ్చేశాడు. రాత్రిళ్లు కలలోకొచ్చి ఆమెను ఇబ్బందిపెట్టటం సహించలేకపోయింది.

పాపాయమ్మకు బోలెడంత ఆస్తివుంది. వయసుమళ్లినా ఇప్పటికీ... పెదాలకు లిప్‌స్టిక్.. కాళ్లకు హై హీల్సు...కళ్లకు కూలింగ్ గ్లాసెస్... బొడ్డు కిందకు కట్టే చీర... నిమిషానికి పాతికసార్లు జారిపోయే పైట చూచేకైనా పాపారావు గేదె వెంటపడే దూడలా తనవెంట జొల్లు కార్చుకుంటూ తిరుగుతాడనే పాపాయమ్మ ఆశ నిరాశే అవటం వల్ల... ఆమె మనసు అశాంతికి గురవక తప్పలేదు. మనిషిని నిరాశతో... నిరుత్సాహంతో కృంగిపోవలసివచ్చింది.

తన్లాంటి రూపసిని... సుందరాంగిని తప్పక వరిస్తాడనే కాన్ఫిడెన్స్‌లో వున్న ఆమెకు నిరుత్సాహం ఎదురవటంతో పాపారావుపై కక్షకట్టింది! ఆడది కదా!

నచ్చక నచ్చక తనకు వి.సి. పాపారావు నచ్చాడు. అలాంటి తనను ఆయన తిర్కరించటం దుర్భరంగ తోచింది. తనను కాదన్నందుకు పాపారావు పనిపట్టాలని అప్రతిష్టపాలు చేయాలని స్టూడెంట్స్‌తో చేతులు కలిపి గోడల నిండా పిచ్చిరా(కూ)తలు రాయించింది.

అది చూచిన పాపారావు వెరవలేదు. పాపాయమ్మ తనపై ఈ విధంగ తనపై కచ్చ తీర్చుకో ప్రయత్నించిందని గ్రహించిన పాపారావు రోషపడలేదు. స్టాఫ్ మెంబర్స్ సైతం చెవులు కొరుక్కుంటున్నారని తెలిసి బాధపడలేదు.

తానేమిలో... ఎలాంటివాడో అందరికీ తెలుసు ! అంతటితో ఆగని దుష్ప్రచారం దినపత్రలకు.. ఎలక్ట్రానిక్ మీడియా వరకు పాకింది. తనకంటూ ఫామిలీగాని చిల్డ్రన్‌గానీ లేదు గనుక ఈ పరిస్థితి విపరీత పరిణామాలనకు దారితీయకపోవటం తన అదృష్టంగ భావించాడు.

నెలకు తనకొస్తున్న జీతమే ఆధారంగ జీవిస్తున్నాం. ఆమె అందానికి తళుకు బెళుకులకు ఆమె వెనక వున్న ఆస్తిసాస్తులకు లొంగలేదు.

తాను పరమ నిష్ఠాగరిష్ఠుడు ! భీష్ముడుకి సహోదరుడు! ఆంజనేయుడు తన ఆరాధ్య దైవం ! తాను స్త్రీ ద్వేషికాకున్నా... పెళ్లి... వైవాహిక జీవితంపట్ల సుముఖతలేనివాడు కావటాన అస్కలిత బ్రహ్మచారిగానే తనువు చాలించాలనే కఠోర నిర్ణయం ఏనాడో తీసుకున్నవాడు!

తనకా వి.సి. గా రిటైర్మెంట్ మరో రెండేళ్లల్లోకి గెంతుకొచ్చింది. ఈ క్షణాన పోస్ట్‌కు రిజైన్‌చేసినా వచ్చే పెన్షన్‌తో దర్జాగ బ్రతగ్గలననే ధీమా వున్నవాడు అయినందున ప్రస్తుత దుమారానికి తాను పోస్ట్‌కి రాజీనామా సమర్పించటమేక ఏకైక మార్గంగా తోచింది.

X X X

నెల తిరగ్గానే ఠంచన్‌గ ఫించనొచ్చి బ్యాంకు ఎకౌంట్లో పడుతోంది. వచ్చిన గ్రాట్యుయిటీతో సిటీ నడిబొడ్డున అందమైన విల్లా కట్టించుకున్నాడు పాపారావు.

వ్యాపకం లేకుండా పోయిందేనన్న అశాంతి తప్ప మరే ఇదరమైన బాధాలేదు.

తాను వి.సి. పదవికి రాజీనామా చేయటం పాపాయమ్మను చెప్పుతో కొట్టినట్టయింది. తనది సరైన నిర్ణయమే అన్పించింది.

ఇప్పుడు అంతా తీరుబడే! ఆహ్వానాల మేరకు ఉపన్యాసకుడిగా సభలకు వెళ్లటం తనకు తృప్తినిస్తోంది.

కవి మిత్రులు... రచయితలు తరచు తన విల్లాకొస్తున్నారు. వారితో చర్చలు... సంభాషణలు... మంచి కాలక్షేపంగానూ వుంది.

చాలామంది యువకవులు రచయితలు తాము ముద్రించుకోనున్న రచనలకు పీఠిక రాయమంటూ తనపై అపారమైన అభిమానాన్ని చూపటం పాపారావుకెంతో ఆనందాన్నిస్తోంది.

తాను వయసులో వుండి రచనలు చేస్తున్నప్పుడు తన పుస్తకాలకు ముందుమాట (పీఠిక) రాయమని ఎందరో పెద్దలను కలిసి అర్థించగా కొందరు పెదవి విరుచేవారు. మరికొందరైతే సిగ్గు బిడియం విడిచి పీఠిక వ్రాసినందుకెంతిస్తావంటూ అడిగేవారు. వారు అడిగినంత డబ్బు ఇస్తేగానీ పీఠిక రాయమంటూ మొండికేసేవారు. డబ్బిచ్చి పుస్తకాలకు ముందుమాట రాయించుకోవటం పాపారావుకు బొత్తిగా ఇష్టం వుండేది కాదు. అందుకే... పుస్తకరూపంలో వచ్చిన రచనలన్నీ పీఠికలు లేకుండానే వెలువడినయ్. పుస్తకానికి ముందుమాట లేనంత మాత్రాన రచన విలువ ఏమాత్రం తగ్గదని పాపారావు తీర్మానించుకున్నాడు. డబ్బిస్తే... గొప్పగా రచన వుందంటూ నిజా నిజాలను విస్మరించి రచయితను రచనను ఆకాశానికెత్తేస్తూ రాసేవారున్న రోజుల్లో అలాంటి నిష్ప్రయోజనమైన పీఠిక పుస్తకాల్లో లేకున్నా... ప్రమాదమేమీ లేదన్పించింది. డబ్బుకోసం కక్కుర్తిపడి పీఠికలు రాసేవారిని అసహ్యించుకున్నాడు.

అందుకే... గతం నేర్పిన గుణపాఠంతో ఈనాడు తనవద్దకు తమ పుస్తకానికి పీఠిక వ్రాసిపెట్టమని అడిగేవారిని నిరాశపరచకుండా రచనలను క్షుణ్ణంగ చదివి రచయితకు మార్గదర్శకంగా వుండే విధంగ పుస్తకానికి పీఠిక రాయటానికే ప్రాముఖ్యత నివ్వటం పాపారావు తన బాధ్యతగ అన్పించి పీఠిక రాయటం జరుగుతుండేది.

అనేక వందల రచయితల పుస్తకాలకు పైసా తీసుకోకుండా పీఠికలు రాస్తూండటాన పాపారావు... పీఠిక పాపారావుగ ప్రసిద్ధి చెందాడు !!

--- సమాప్తం ---